నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, సోమవారం 7 అక్టోబర్ 2024 | MAHABUBNAGAR NARAYANPET

కూష్మాండదుర్గగా దర్శనమిస్తున్న అలంపూర్ జోగుళాంబ, శ్రీశైల భ్రామరీ అమ్మవార్లు

కూష్మాండ దుర్గా.. పాహిపాహి

అలంపూర్, అక్టోబర్ 6 : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం జోగుళాంబ అమ్మవారు కూష్మాండ దేవీగా దర్శనమిచ్చారు. నిత్యపూజల్లో భాగంగా హోమాలు, బలిహరణలు, కుంకుమార్చనలు చేశారు. సాయంత్రం దశవిధహారతులు సమర్పించారు. కూష్మాండదేవికి కొలువు పూజాకు మరి సువాసినీ పూజ, దర్బార్ సేవ నిర్వహించి నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించారు. ఈ మాతను పూజిస్తే చదువు, జ్ఞానం, ధైర్యం సిద్ధిస్తాయని భక్తుల నమ్మకం.సెలవురోజు కావడంతో అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. భక్తులకు అత్యవసర చికిత్సలు అందించేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు క్యాతూరు పీహెచ్‌సీ సిబ్బంది హెల్త్ క్యాంప్ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ బాలీశ్వర యశ్వంత్, ఏఎన్‌ఎంలు హైమావతి, ఫార్మసిస్ట్, ఆశ కార్యకర్తలు పద్మ, చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

జోగుళాంబ ఆలయంలో మంత్రి శ్రీధర్‌బాబుకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే విజయుడు

మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే విజయుడు పూజలు

జోగుళాంబ ఆలయానికి ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు రాగా.. అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు స్వాగతం పలికారు. పుష్పగుచ్చాలు అందజేసి శాలువాతో సన్మానించారు. అనంతరం మంత్రితో కలిసి ఆలయాలను దర్శించుకున్నారు. మంత్రి కుటుంబసభ్యులు అమ్మవారి యాగశాలలో హోమం నిర్వహించారు. అలాగే ఎంపీ మల్లురవి కూడా పూజలు చేశారు. దర్శన అనంతరం అర్చకులు వేదాశీర్వచనం పలికారు. కార్యక్రమంలో ఈవో పురేందర్‌కుమార్, ఆలయ పాలకమండలి చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్ పాల్గొన్నారు. అనంతరం తెలంగాణ టూరిజం హోటల్‌లో సంపత్‌కుమార్‌తో కలిసి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో సమీక్ష నిర్వహించారు.

శ్రీశైలంలో..

శ్రీశైలం, అక్టోబర్ 6 : శ్రీశైలంలో భ్రమరాంబాదేవి కుష్మాండ దుర్గాగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారు సాత్విక రూపంలో సింహవాహనాన్ని అధిష్టించి ఎనిమిది చేతుల్లో కుడివైపు పద్మం, బాణం, ధనస్సు, కమండలం, ఎడమవైపు చక్రం, గద, జపమాల, అమృతకళశాన్ని దాల్చినట్లు ఈవో పెద్దిరాజు తెలిపారు. సాయంత్రం భ్రమరాంబ, మల్లికార్జున స్వామివారు కైలాసవాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. అక్కమహాదేవి అలంకార మండపంలో కుష్మాండ దుర్గా సమేతుడైన మల్లన్నకు విశేష అర్చనలు, హారతులు, షోడశపూజలు నిర్వహించారు. ఆదిదంపతులు కైలాస వాహనంపై గంగాధర మండపం నుంచి నంది మండపం, బయలు వీరభద్ర స్వామి ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. గ్రామోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు బారులుదీరారు. అనంతరం కాళరాత్రిపూజ మంత్రపుష్పం తదితరాలతో అమ్మవారికి ఆస్థానసేవ నిర్వహించినట్లు ఆలయ స్థానాచార్యులు పూర్ణానంద ఆరాధ్యులు తెలిపారు. కళారాధనలో తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల నుంచి వచ్చిన కళాకారులు ఆటా పాటలు అలరించారు.

'మహాలక్ష్మి'గా అమ్మవారు

పాలమూరు/ఆత్మకూరు, అక్టోబర్ 6 : శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడలోని వాసవి కన్యకాపరమేశ్వరీ ఆలయంలో ఆదివారం అమ్మవారు మహాలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చారు. కాగా, అమ్మవారిని రూ.6,66,66,666 అలంకరించారు. నగదు ఎక్కువగా ఉండడంతో భారీ సెక్యూరిటీ కల్పించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అలాగే ఆత్మకూరు కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని రూ.2.90 కోట్లతో ధనలక్ష్మి అవతారంలో దర్శనమిచ్చారు. సాయంత్రం ఆలయంలో మహిళలు బతుకమ్మ ఆడారు. అలాగే స్వర్ణకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపాల్లో మహిళలు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమాల్లో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్‌లో రూ.6,66,66666 లతో మహాలక్ష్మీ అలంకరణలో కన్యకాపరమేశ్వరీ అమ్మవారు

ఆత్మకూర్ పట్టణంలో రూ. 2 కోట్ల 90 లక్షలతో అమ్మవారిని ధనలక్ష్మీగా అలంకరించిన దృశ్యం

కుంగిన డివైడర్ సైడ్ డ్రైనేజీ

మహ్మదాబాద్ వద్ద గుంత ఏర్పడిన డివైడర్ సైడ్ డ్రైనేజీ

మహ్మదాబాద్, అక్టోబర్ 6 : భూత్పూరు నుంచి చించోళి వరకు 167 నేషనల్ హైవే విస్తరణలో భాగంగా మహ్మదాబాద్‌లో రోడ్డుకు ఇరువైపులా సైడ్ డ్రైనేజీ నిర్మించారు. మహ్మదాబాద్ గ్రామంలోకి వెళ్లే ముఖ్య రహదారి పక్కన శనివారం రాత్రి డ్రైనేజీ కుంగిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు విస్తరణ పనులు జరుగుతుండగా, వాహనాలను సర్వీస్ రోడ్లపై నుంచి మళ్లిస్తున్నారు. దీంతో మెయిన్ రోడ్డు నుంచి సర్వీస్ రోడ్డుకు వెళ్లాలంటే సైడ్ డ్రైనేజీపై నుంచే వాహనాలు వెళ్లాల్సి ఉంటుంది. ఐదారు రోజుల నుంచి తాండూరు, మహబూబ్‌నగర్ వెళ్లే భారీ వాహనాలు సైడ్ డ్రైనేజీపై నుంచి వెళ్లడంతో డ్రైనేజీ కుంగిపోయి ఇనుప చువ్వలు విరిగిపోయాయి

- రేవంత్ ప్రభుత్వంలో ఆదరణ కరువు
- ఒక్క రోజుకే పరిమితమైన పండుగ
- కేసీఆర్ ప్రభుత్వంలో వైభవంగా నిర్వహణ
- నాడు పది రోజులు ఊరూరా పూల పండుగే..
- బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు

బతుకమ్మ ఆడుతున్న మహిళలు (ఫైల్)

భారమైన బతుకమ్మ !

నారాయణపేట, అక్టోబర్ 6 : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నది. వేడుకలను అధికారికంగా నిర్వహించకపోగా, స్వచ్ఛందంగా నిర్వహిస్తుంటే కరెంట్ కోతలు విధించడం గమనార్హం. ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో బతుకమ్మ వేడుకలకు తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పూర్వవైభవాన్ని తీసుకొచ్చారు. పల్లె నుంచి ప్రపంచంలోని వివిధ దేశాల్లో సైతం కనుల పండువగా వేడుకలను నిర్వహించేలా ఖ్యాతిని తీసుకొచ్చారు. అంతేకాకుండా దసరా వేడుకలకు ముందు ప్రత్యేకంగా బతుకమ్మ చీరలను అందించి 8రోజుల పాటు వేడుకలు నిర్వహించి ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకం అందించారు. నారాయణపేటకు ఎంతో చరిత్ర కలిగిన బారం బావిని గతంలో నారాయణపేట కలెక్టర్‌గా పనిచేసిన దాసరి హరి చందన శుభ్రం చేయించి విద్యుద్దీపాలతో అలకరింపజేసి 8రోజులపాటు ఆటా పాటలతో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఎంతో ప్రత్యేకత కలిగిన పండుగ వేడుకలను కాంగ్రెస్ సర్కారు పట్టించుకోవడం లేదు. వేడుకలు ప్రారంభమై మూడు రోజులు కావస్తున్నా ఊసేలేదు. 7వ తేదీన ఒక్క రోజు మాత్రం అధికారికంగా వేడుకలను నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త చంద్రకాంత్ తెలిపారు. ఇదిలా ఉండగా, జిల్లా పరిధిలోని అన్ని గ్రామాల పరిస్థితి ఇలాగే ఉందని చెప్పొచ్చు.

గ్రామాల్లోనూ అదే పరిస్థితి..

కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో నిధుల లేమి కారణంగా గ్రామాలు అపరిశుభ్రతకు కేరాఫ్ అడ్రస్‌గా మారాయి. కేసీఆర్ పాలనలో పట్టణాలతో సరిసమానంగా గ్రామాలు అభివృద్ధి సాధించాయి. గ్రామాల్లో ట్రాక్టర్లతో తడి, పొడి చెత్త సేకరణకు శ్రీకారం చుట్టారు. ఇందుకు ప్రత్యేకంగా నిధులు కేటాయించేవారు. దీంతో గ్రామాల్లో పారిశుధ్యం పరిఢవిల్లింది. ఏటా బతుకమ్మ కోసం ఆయా ప్రాంతాలను ప్రత్యేకంగా శుభ్రం చేసేవారు. దీంతో మంచి వాతావరణంలో బతుకమ్మ నిర్వహించేవారు. కానీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో గ్రామాల అభివృద్ధిని పూర్తిగా విస్మరించారు. కనీసం పారిశుధ్య చర్యలు చేపట్టేందుకు కూడా నిధులు లేని పరిస్థితి దాపురించింది. ఈ క్రమంలో మహిళలే ముందుకొచ్చి స్వచ్ఛందంగా శుభ్రం చేసుకొని బతుకమ్మ ఆడుతున్న దుస్థితి ఏర్పడింది. గ్రామీణ ప్రాంత మహిళలు సైతం కాంగ్రెస్ ప్రభుత్వ వివక్షను దుయ్యబడుతున్నారు.



బీఆర్ఎస్ పాలనలో విద్యుత్ దీపాలతో అలంకరించిన బారం బావి (ఫైల్)

ముఖ్యమంత్రికి సోయి లేదు..

పరిపాలించడానికి చేతగాని ముఖ్యమంత్రికి రాష్ట్ర పండుగలపై కూడా సోయి లేదు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ఎంతో ప్రత్యేకంగా నిలుస్తున్నది. అలాంటి పండుగను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదు.

– లక్ష్మి, మాజీ ఎంపీటీసీ, కొమ్మూరు, గుండుమాల్ మండలం

మహిళలంటే చిన్నచూపెందుకు..?

పదేండ్లు బతుకమ్మ పండుగను వైభవంగా నిర్వహించారు. కేసీఆర్ సారు ఆడపడుచులకు చీరలు కూడా ఇస్తుండె. రేవంత్ రెడ్డి సీఎం అయినంక బతుకమ్మ పండగకు కళ తప్పింది. మహిళలంటే సర్కార్‌కు ఎందుకు ఇంత చిన్నచూపు. అధికారం కోసం గొప్పలు చెప్పి ఉన్న పండుగలకు కూడా ప్రాధాన్యత ఇస్తలేరు.

– గౌని సురేఖారెడ్డి, మాజీ జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్, నారాయణపేట జిల్లా

ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుంది..

బతుకమ్మ పండుగకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ 18ఏండ్లు నిండిన మహిళందరికీ చీరలను పంపిణీ చేసేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. వేడుకలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నది. ప్రపంచవ్యాప్తంగా ఎంతో పేరుగాంచి విదేశాల్లోనే బతుకమ్మ వేడుకలను నిర్వహిస్తుండగా, మన పండుగైన తెలంగాణ లోనే వేడుకలను నిర్వహించకుండా అవాంతరాలు సృష్టించడం బాధాకరం.

– లలిత, మాజీ స్త్రీ శిశు సంక్షేమశాఖ సభ్యురాలు, మక్తల్, నారాయణపేట జిల్లా

'రామన్నగట్టు'ను పూర్తి చేయాలి

కిష్టాపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

- సాగునీళ్లిచ్చేదాకా వదిలే ప్రసక్తేలేదు
- 'హైడ్రా'మా పేరిట ప్రజల్లో భయభ్రాంతులు
- మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

పాన్‌గల్, అక్టోబర్ 6 : కేసీఆర్ సర్కారు హయాంలో మంజూరై శంకుస్థాపన చేయబడిన రామన్నగట్టు రిజర్వాయర్‌ను సకాలంలో పూర్తి చేయాలని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని కిష్టాపూర్ నుంచి రామన్నగట్టు రిజర్వాయర్ శిలాఫలకం వరకు కార్యకర్తలతో కలిసి ఆదివారం బైక్‌ర్యాలీ నిర్వహించారు. రిజర్వాయర్‌కు జీవో లేదని ప్రచారం చేసిన అధికార పార్టీ నాయకులకు చెంపపెట్టుగా జీవో కాపీని బహిర్గతం చేశారు. ఈ సందర్భంగా బీరం మాట్లాడుతూ కేసీఆర్ రైతు పక్షపాతి కాబట్టి ఉండడం తోనే రామన్నగట్టుతోపాటు నియోజకవర్గంలో అనేక రిజర్వాయర్లు, మినీ లిఫ్టులకు నిధులు మంజూరు చేసి పనులకు శంకుస్థాపన చేశారన్నారు. 0.3 టీఎంసీల సామర్థ్యం ఉన్న రామన్నగట్టును పూర్తి చేస్తే మండలం సస్యశ్యామలంగా మారుతుందన్నారు. ఈ నేపథ్యంలో మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రత్యేక చొరవ తీసుకొని టెండర్ల ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే రైతుల తరపున బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. సాగునీరు అందేదాక వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన రుణమాఫీ, రైతుభరోసా వంటి పథకాల్లో ఏ ఒక్కటీ అమలు కావడం లేదన్నారు. ఆరు హామీలపై నిలదీస్తారనే భయంతో 'హైడ్రా'మాకు తెరలేపిందన్నారు. గత ప్రభుత్వంలో రూ.1.74 కోట్లతో మంజూరైన గోప్లాపూర్ స్టేజీ-రేమద్దుల బీటీ, సీసీరోడ్డు పనులు చేపట్టాల్సి ఉందన్నారు. కానీ కిష్టాపూర్, కిష్టాపూర్ తండా, రేమద్దులలో సీసీరోడ్డు మినహా ఇంతవరకు మిగతా బీటీరోడ్డు పూర్తి చేయకపోవడంతో.. బిల్లులు డ్రా చేసుకొని పనులు చేయకుండా తిరుగుతున్న గుత్తేదారు జగ్గారెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న సాగునీటి కాల్వలకు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాజీ ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, నాయకులు శేఖర్ నాయక్, వెంకటయ్య నాయుడు, వీర సాగర్, రాజేశ్వర్‌రెడ్డి, చంద్రూ నాయక్, సుధాకర్‌యాదవ్, శేఖర్, కరుణాకర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, శివారెడ్డి, తిరుపతయ్య, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అధికారుల ఉరుకులు.. పరుగులు

- ఎట్టకేలకు డీఎస్సీ స్పెషల్ ఎడ్యుకేషన్ ధ్రువపత్రాల పరిశీలన
- 'పరిశీలన.. పరేషాన్' కథనానికి స్పందించిన అధికారులు
- 'నమస్తే తెలంగాణ'కు అభ్యర్థుల కృతజ్ఞతలు

ధ్రువపత్రాలు పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబర్ 6 : ఈ నెల 5వ తేదీ వరకే డీఎస్సీ సర్టిఫికెట్ వెరిఫికేషన్ ముగిసిందని అధికారులు ప్రకటించారు. అయితే, ఆదివారం 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో ప్రచురితమైన 'పరిశీలన.. పరేషాన్' కథనంతో అధికారులు ఉరుకులు, పరుగులు పెట్టారు. నిర్దేశిత గడువు ముగిసినా ఎస్జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్‌కు సంబంధించి 20 పోస్టుల భర్తీకి జాబితా రాకపోవడంతో అభ్యర్థులు ఆందోళనకు గురయ్యారు. ఎంతో కష్టపడి చదివి చేతికాడికి వచ్చిన ప్రభుత్వ ఉద్యోగం రాదేమోనని అభ్యర్థులకు నిరాశ ఎదురైంది. ఈ నేపథ్యంలో అభ్యర్థుల అవస్థలు, ఆవేదన, ఆందోళనను 'నమస్తే తెలంగాణ' అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. మొదట కోర్టు కేసు ఉందనే సాకును బూచీగా చూపినా.. ఎట్టకేలకు ఎస్జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్ అభ్యర్థుల జాబితాను ఆన్‌లైన్‌లో పొందుపర్చారు. 20 పోస్టులకుగానూ 39 మంది అభ్యర్థులను ఆదివారం జిల్లా అధికారులు ధ్రువపత్రాల పరిశీలనకు పిలిచారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి కావడంతో 'నమస్తే'కు కృతజ్ఞతలు తెలిపారు. అయితే, ఏజెన్సీ గిరిజనులకు న్యాయం చేయాలని ఏజెన్సీ ఏరియా గిరిజన హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌నాయక్, జిల్లా అధ్యక్షుడు జైపాల్ నాయక్ డిమాండ్ చేశారు.

9న నియామక పత్రాలు..

ధ్రువపత్రాల పరిశీలన పూర్తి కావడంతో అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేసి ఈ నెల 9వ తేదీన నియామక పత్రాలు అందజేయనున్నారు. దసరా సెలవుల తర్వాత కొత్త ఉపాధ్యాయులు విధుల్లో చేరనున్నారు. దీనికి తోడు 2008 డీఎస్సీలో అర్హత సాధించి పలు కారణాలతో నష్టపోయిన వారికి ఎస్జీటీలుగా నియమించే ప్రక్రియ కూడా చేపడుతున్నారు. దీంతో ఉపాధ్యాయుల కొరత చాలా వరకు తీరనున్నది.

ప్రాజెక్టులకు నిలకడగా వరద

జూరాలలో ప్రస్తుత నీటిమట్టం

ధరూరు/అయిజ, అక్టోబర్ 6 : జూరాల ప్రాజెక్టుకు వరద నిలకడగా కొనసాగుతున్నది. ఆదివారం ప్రాజెక్టుకు ఎగువ నుంచి 61 వేల క్యూసెక్కుల వరద రాగా.. మూడు గేట్లను ఎత్తి 21,630 క్యూసెక్కులను దిగువకు వదిలారు. విద్యుదుత్పత్తికి 37,252, నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750, భీమా లిఫ్ట్-2కు 750, ఎడమ కాల్వకు 1,140, కుడి కాల్వకు 730, సమాంతర కాల్వకు 300 క్యూసెక్కులను విడుదల చేశారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటినిల్వ 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 9.439 టీఎంసీల నిల్వ ఉన్నది. ఎగువన కురుస్తున్న వర్షాలతో ప్రాజెక్టులకు వరద స్వల్పంగా కొనసాగుతున్నది. తుంగభద్ర డ్యాంకు ఇన్‌ఫ్లో 14,733, అవుట్‌ఫ్లో 14,422 క్యూసెక్కులుగా నమోదుకాగా.. ప్రస్తుతం 101.773 టీఎంసీల నిల్వ ఉన్నది. ఆర్డీఎస్ ఆనకట్టకు ఇన్‌ఫ్లో 41,318, అవుట్‌ఫ్లో 40,675 క్యూసెక్కులుగా ఉన్నది. ఆయకట్టుకు 643 క్యూసెక్కులు వదిలారు. ప్రస్తుతం ఆనకట్టలో 10.7 అడుగుల మేరకు నీటిమట్టం ఉన్నది. అలాగే ఆల్మట్టి ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 21,010, అవుట్‌ఫ్లో 21,010 క్యూసెక్కులుగా నమోదుకాగా.. ప్రస్తుతం 128.19 టీఎంసీల నిల్వ ఉన్నది. నారాయణపూర్ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 19,021, అవుట్‌ఫ్లో 15,600 క్యూసెక్కులుగా నమోదుకాగా.. ప్రస్తుతం 37.61 టీఎంసీల నిల్వ ఉన్నది.

నమస్తే తెలంగాణ
తెలుగు దినపత్రిక
విలేకరులు కావలెను
ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పనిచేయుటకు మండలాల వారీగా విలేకరులు కావలెను. స్థానిక సమస్యలు, సమకాలీన రాజకీయాలపై అవగాహన కలిగి ఉండాలి. అర్హత, ఆసక్తి, అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుంది.
మహబూబ్‌నగర్ జిల్లా : ★ మహబూబ్‌నగర్ టౌన్ ★ కోయిలకొండ ★ జడ్చర్ల టౌన్ ★ జడ్చర్ల రూరల్ ★ రాజాపూర్
నారాయణపేట జిల్లా : ★ కోస్గి టౌన్ ★ గుండుమాల్ / కొత్తపల్లి ★ నర్వ
వనపర్తి జిల్లా : ★ వనపర్తి రూరల్ ★ వనపర్తి మున్సిపాలిటీ ★ రేవల్లి ★ శ్రీరంగాపూర్
జోగులాంబ గద్వాల జిల్లా : ★ గద్వాల సిటీ సెంటర్ ★ అలంపూర్ రూరల్ ★ అలంపూర్ చౌరస్తా
నాగర్‌కర్నూల్ జిల్లా : ★ నాగర్ కర్నూల్ రూరల్ ★ నాగర్‌కర్నూల్ టౌన్ ★ తెలకపల్లి ★ కల్వకుర్తి టౌన్ ★ కొల్లాపూర్ రూరల్ ★ కొల్లాపూర్ టౌన్ ★ మన్నూరు ★ దోమలపెంట
రాత పరీక్ష తేది : 09-10-2024
సమయం : ఉదయం 11 గంటలకు
పరీక్షా కేంద్రం
వాగ్దేవి జూనియర్ కళాశాల
న్యూటౌన్, మహబూబ్‌నగర్
Cell : 9182777499, 9182777874